స్వచ్ఛ కరీంనగర్‌కు సహకరించాలి: నగర కమిషనర్

కార్పొరేషన్, మార్చి 25 : కరీంనగర్‌ను స్వచ్ఛ నగరంగా మార్చేందుకు ప్రజలు సహకరించాలని నగర కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ కోరారు. స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం నగరంలోని వావిలాలపల్లిలో పర్యటించారు. తడి, పొడి చెత్త వేరు చేయడం, తడి చెత్త ద్వారా వర్మికంపోస్టింగ్ తయారీ, పొడి చెత్తలో ప్లాస్టిక్ వ్యర్థాలు, అట్టముక్కలను డీఆర్ సీసీ, ఆర్ ఆర్ ఆర్ సెంటర్లకు తరలించడాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, స్వచ్ఛ సర్వేక్షణ్‌లో ప్రతి మహిళా భాగస్వాములై పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, తడి, పొడి చెత్తను వేర్వేరు డబ్బాల్లో వేసి నగరపాలక సంస్థ కార్మికులకు అందించాలని సూచించారు. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో కరీంనగర్ నగరపాలక సంస్థ మెరుగైన ర్యాంకు సాధించేలా సహకరించాలని కోరారు.

నగర ప్రజలు సకాలంలో పన్నులు చెల్లించాలి

నగర ప్రజలు ఆస్తి పన్నులు సకాలంలో చెల్లించి కరీంనగర్ నగరపాలక సంస్థ అభివృద్ధికి సహకరించాలని కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ కోరారు. ఆస్తి పన్నుల వసూల్లలో భాగంగా మంగళవారం నగరంలోని పలు డివిజన్‌లలో పర్యటించారు. ఆస్తి పన్నుల చెల్లింపునకు ఇంకా ఆరు రోజుల గడువు మాత్రమే ఉందని, ఆలోగా ప్రజలు తమ ఆస్తి పన్నులను చెల్లించాలని సూచించారు. మరో వైపు కరీంనగర్ నగరపాలక సంస్థ కార్యాలయం సమావేశ మందిరంలో రెవెన్యూ విభాగం అధికారులు, వార్డు ఆఫీసర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. పన్నులు చెల్లించని ప్రాపర్టీలను సీజ్ చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ స్వరూపారాణి, రెవెన్యూ విభాగం అధికారులు, వార్డు ఆఫీసర్లు పాల్గొన్నారు.

విధులు బహిష్కరించిన న్యాయవాదులు

కోర్టుచౌరస్తా, మార్చి 25 : రంగారెడ్డి జిల్లా కోర్టులో న్యాయవాదిగా విధులు నిర్వర్తిస్తున్న ఇజ్రాయిల్ అనే న్యాయవాది హత్యను నిరసిస్తూ కరీంనగర్ బార్ అసోసియేషన్ న్యాయవాదులు మంగళవారం తమ కోర్టు విధులకు గైర్హాజరై నిరసన వ్యక్తం చేశారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పీవీ రాజ్ కుమార్, ప్రధాన కార్యదర్శి బేతి మహేందర్ రెడ్డి మాట్లాడుతూ, వెంటనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి న్యాయవాదుల రక్షణ చట్టం తేవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు, రఘువీర్, కటకం రాజేందర్, బెజ్జంకి శ్రీకాంత్, న్యాయవాదులు పాల్గొన్నారు.

హుజూరాబాద్ రూరల్, మార్చి 25: హుజూరాబాద్ కోర్టు న్యాయవాదులు విధులను బహిష్కరించి ప్రధానం ద్వారం వద్ద నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాస్, కార్యదర్శి తిరుపతి, ఉపాధ్యక్షుడు రమేశ్, న్యాయవాదులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగులకు అవార్డుల ప్రదానం

తెలంగాణచౌక్, మార్చి25: ఆర్టీసీ ఉద్యోగులకు ప్రగతి చక్రం అవార్డులను అందజేశారు.2024-2025 ఆర్థిక సంవత్సరం ద్వితీయ, తృతీయ, త్రైమాసికాల్లో ఉత్తమ పనితీరుకు గానూ పలువురు డ్రైవర్స్, కండక్టర్లకు ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలోని సమావేశం మందిరంలో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆర్ఎం రాజు అవార్డులు, ప్రశంసా పత్రాలు ప్రదానం చేశారు. కార్యక్రమంలో డీఆర్ఎంలు భూపతిరెడ్డి, వెంకటేశ్వర్‌రావు, పర్సనల్ ఆఫీసర్ చంద్రయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

ఏప్రిల్ దాకా సాగునీరందించాలి

శంకరపట్నం, మార్చి 25: ఏప్రిల్ నెలాఖరు వరకు ఎస్సారెస్పీ కాలువ ద్వారా సాగు నీటిని అందించి పంటలను కాపాడాలని పలువురు కేశవపట్నం రైతులు ఎస్సారెస్పీ అధికారులకు విన్నవించారు. మంగళవారం కేశవపట్నం గ్రామానికి చెందిన రైతులు తాడవేని సమ్మయ్య, కొమురయ్య, బొంగోని కిష్టస్వామి, ఎం శంకర్, బొజ్జ రవి ఆధ్వర్యంలో మంగళవారం తాడికల్ డిస్ట్రిబ్యూషన్ రెగ్యులేటరీ కార్యాలయంలో పలువురు రైతుల సంతకాలతో కూడిన వినతి పత్రం అందజేశారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం మార్చి నెలాఖరు వరకు కాలువ ద్వారా సాగు నీటిని విడుదల చేయాలని అధికారులు నిర్ణయించగా, దానిని ఏప్రిల్ నెలాఖరు వరకు కొనసాగించి పొట్ట దశలో ఉన్న పంటలను కాపాడాలని అధికారులను కోరారు. ఇక్కడ పలువురు రైతులు పాల్గొన్నారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

తిమ్మాపూర్ రూరల్, మార్చి 25: ఎల్ఎండి కాలనీలోని దుర్గాబాయి మహిళా శిశు వికాస కేంద్రంలో మహిళలకు ఎలక్ట్రికల్ ఆటో డ్రైవింగ్‌లో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు డిస్ట్రిక్ట్ మేనేజర్ వి. సుధారాణి ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల మహిళలు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు 934711 4396,9849787823 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

ఐక్య పోరాటాలతో హక్కులు సాధించుకోవాలి

తెలంగాణచౌక్, మార్చి25: నాయీబ్రాహ్మణ కులస్తులు ఐక్య పోరాటాలతో హక్కులు సాధించుకోవాలని తెలంగాణ నాయీబ్రాహ్మణ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పాల్వాయి శ్రీనివాస్ నాయీ పిలుపు నిచ్చారు. నగరంలోని తీగలగుట్టపల్లిలోని నాయీబ్రాహ్మణ కళ్యాణ మండపంలో మంగళవారం ఆ సంఘం జిల్లా నూతన అధ్యక్షుడిగా నీలం మొండయ్య, ప్రధాన కార్యదర్శిగా జంపాల సంపత్ ప్రమాణస్వీకారం చేయగా, ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. నాయీబ్రాహ్మణుల సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నూతన కమిటీకి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు మోహన్, కోశాధికారి శివ, నూతన కార్యవర్గ సభ్యులు లక్ష్మణ్‌కుమార్, వెంకటేశ్, రమేశ్, శ్రీను, సదానందం పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి చాడ పరామర్శ

చిగురుమామిడి, మార్చి 25: రేకొండ గ్రామంలో బోయిని చిలకమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా, బాధిత కుటుంబాన్ని మంగళవారం సీపీఐ జాతీయ నేత చాడ వెంకటరెడ్డి పరామర్శించారు. అలాగే రేకొండ గ్రామంలో శ్రీకృష్ణ యాదవ సంఘానికి సీఎం ద్వారా మంజూరు చేయించిన రూ.ఆరు లక్షల స్పెషల్ గ్రాంట్స్ నిధుల జీవో కాపీని అధ్యక్షుడు చందవేని స్వామికి అందజేశారు.

వృద్ధురాలిపై లైంగిక దాడి

సైదాపూర్, మార్చి25: వృద్ధురాలు(70)పై ఓ యువకుడు లైంగిక దాడి చేసిన ఘటన బొమ్మకల్ గ్రామంలో జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. కరీంనగర్‌కు చెందిన ఓ యువకుడు (33) ఎనిమిది నెలల క్రితం ఉపాధి కోసం బొమ్మకల్‌కు వచ్చాడు. గ్రామానికి చెందిన ఓ ఇంట్లో కిరాయికి ఉంటున్నాడు. కొన్నిరోజుల క్రితం అతడి భార్యాపిల్లలు ఊరికి వెళ్లారు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి ఆ ఇంట్లో ఉండే వృద్ధురాలిపై లైంగిక దాడి చేశాడు. ఎవరికీ చెప్పవద్దని బెదిరించాడు. సోమవారం ఆ వృద్ధురాలు ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉన్నది.

క్రీడలతో మానసికోల్లాసం

గంగాధర, మార్చి 25 : క్రీడలతో శారీరక ఆరోగ్యంతో పాటు మానసికోల్లాసం కలుగుతుందని మాజీ వైస్ ఎంపీపీ కర్ర బాపురెడ్డి అన్నారు. మండలంలోని ఉప్పరమల్యాలలో కొనసాగుతున్న యూపీఎల్-7 క్రికెట్ పోటీల ముగింపు కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బాపురెడ్డి విజేతలకు బహుమతులు అందజేశారు. టోర్నమెంట్‌కు ప్లైజ్‌మనీ స్పాన్సర్ చేసిన ఎంఆర్‌పీఎస్ గ్రామాధ్యక్షుడు సముద్రాల శివరామకృష్ణను అభినందించారు. కార్యక్రమంలో డీఈ సాయిబాబ, బాషుమియా, మహేశ్, శ్రీకాంత్, మధు, అంజి, తిరుమల్ తదితరులు పాల్గొన్నారు.

జీకే ఒలింపియాడ్‌లో అల్ఫోర్స్ విద్యార్థులకు పతకాలు

కమాన్‌చౌరస్తా, మార్చి 25: జిల్లా కేంద్రంలోని కొత్తపల్లి అల్ఫోర్స్ ఇ-టెక్నో పాఠశాల విద్యార్థులు జీకే ఒలింపియాడ్‌లో అత్యుత్తమ ఫలితాలు సాధించి పతకాలు అందుకోగా, మంగళవారం పాఠశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థులను విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ వీ నరేందర్ రెడ్డి అభినందించారు. పాఠశాలకు చెందిన వి. ఆశ్రిత రెడ్డి, సీహెచ్ సోహన్, పి. మయాంక్ రెడ్డి, సాగి శ్రీదాత్రి, యూ రితేష్, లిఖిత్ కుమార్, ఇ. రాజ్ ఆరుష్ పటేల్, కె. తనీష్ రెడ్డి, కె. రిషిక్ జోనల్ స్థాయిలో మెడల్స్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ కైవసం చేసుకున్నారని వెల్లడించారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు నమోదు చేయాలని ఆకాంక్షించారు. ఇక్కడ పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులను అభినందిస్తున్న నరేందర్ రెడ్డి

కేంద్ర మంత్రి నిరాధార ఆరోపణలు మానుకోవాలి

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్

- కేటీఆర్‌ను విమర్శించే స్థాయి సునీల్‌రావుకు లేదు
- మేయర్ పదవి కేటీఆర్ భిక్ష
- ఇష్టారీతిగా ఆరోపణలు చేస్తే ఊరుకునేది లేదు
- బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్

కార్పొరేషన్, మార్చి 25 : మాజీ సీఎం కేసీఆర్‌పై ఓ బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కు మార్ నిరాధార ఆరోపణలు మానుకోవాలని బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్ పేర్కొన్నారు. కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్, ఆ పదవిని మరచి మాట్లాడడం సిగ్గు చేటన్నారు. మంగళవారం స్థానిక 37వ డివిజన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కేసీఆర్‌కు దొంగ నోట్ల ప్రింటింగ్ ప్రెస్ ఉందన్న బండి సంజయ్‌కు ఆ విషయం ఎలా తెలిసిందని ప్రశ్నించారు. ఆయన ఆ ప్రెస్‌లో ఏమైనా పని చేశారా అని ఎద్దేవా చేశారు. దేశానికి మంత్రిగా ఉన్న వ్యక్తి ఇలాంటి ఆరోపణలు చేయడం సరికాదన్నారు. బండి సంజయ్ రాష్ట్రంలో తన పనులు చేసుకునేందుకు ఇలాంటి వ్యాఖ్యలు చేశారని విమర్శించారు. బండి సంజయ్‌కు దమ్ముంటే కాంగ్రెస్ ఆరు గ్యారెంటీల మీద మాట్లాడాలని సవాల్ చేశారు. గత రెండు రోజుల క్రితం కరీంనగర్‌లో మాజీ మంత్రి కేటీఆర్ ర్యాలీకి యువత నుంచి వచ్చిన స్పందన చూసి ఓర్వలేక బీజేపీ, కాంగ్రెస్ నాయకులు ఇష్టారీతిగా ఆరోపణలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. కేటీఆర్‌ను విమర్శించే స్థాయి సునీల్‌రావుకు లేదన్నారు. ఆయన కాలి గోటికి కూడా సునీల్‌రావు సరిపోడని దుయ్యబట్టారు. సునీల్ రావుకు మేయర్ హోదా ఇచ్చిందే బీఆర్ఎస్ పార్టీ అని, అది కేటీఆర్ భిక్ష అని పేర్కొన్నారు. కరీంనగర్ రాజకీయాల్లో ఆయన ఊసరవెల్లి లాంటి వాడని విమర్శించారు. కాంగ్రెస్‌లో ఉండి బీఆర్ఎస్‌లో చేరి దొడ్డిదారిన పదవి పొంది కోట్లు సంపాదించాడని ఆరోపించారు. అత్యంత అవినీతి పరుడు ఎవరని గూగుల్‌లో వెతికితే సునీల్ రావు పేరు వస్తుందని విమర్శించారు. బీఆర్ఎస్ నేతలపై ఇష్టారీతిగా మాట్లాడితే ఊరుకోబోమని, ఇంటిని ముట్టడిస్తామని హెచ్చరించారు. స్మార్ట్‌సిటీలో బండి సంజయ్ పాత్ర లేదని బీఆర్ఎస్‌లో ఉన్నప్పుడు విమర్శించిన విషయాన్ని మరిచిపోయారా అని ప్రశ్నించారు. కరీంనగర్ అభివృద్ధి మాజీ మంత్రి కేటీఆర్, మాజీ ఎంపీ వినోద్‌కుమార్, ఎమ్మెల్యే గంగుల కమలాకర్‌తో మాత్రమే సాధ్యమైందని గుర్తు చేశారు. బీఆర్ఎస్‌లో ఉన్నప్పుడు కాంగ్రెస్, బీజేపీ నాయకులను, బీజేపీలో చేరగానే బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులను విమర్శించడం సునీల్‌రావుకు అలవాటుగా మారిందన్నారు. బీఆర్ఎస్ హయాంలోనే కరీంనగర్ అన్ని విధాలా అభివృద్ధి చెందిన విషయాన్ని మంత్రి పొన్నం ప్రభాకర్ గుర్తించాలన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి నగరంలో అభివృద్ధి పనులు ఎక్కడివి అక్కడే ఆగిపోయాయని పేర్కొన్నారు. 15 నెలల కాలంలో మంత్రిగా పొన్నం ప్రభాకర్ కరీంనగర్‌కు ఏంచేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. తమ హయాంలో జరిగిన అభివృద్ధే తప్ప కాంగ్రెస్ ప్రభుత్వం చేసిందేమీ లేదన్నారు. మాజీ సీఎం కేసీఆర్‌కు ప్రజల్లో వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక కాంగ్రెస్, బీజేపీ కలిసి డైవర్షన్ డ్రామాలు చేస్తున్నాయని దుయ్యబట్టారు. సమావేశంలో బీఆర్ఎస్ నగర ప్రధాన కార్యదర్శి గడ్డం ప్రశాంత్‌రెడ్డి, నాయకులు సాయి కృష్ణ, మోహన్, నేతి చంద్రశేఖర్, ఆరె రవిగౌడ్, కొత్త అనిల్‌కుమార్, రాజేందర్, దుడెల్ల ప్రశాంత్, కర్రె అనిల్, ఎడబోయిన శ్రీనివాసరెడ్డి, మెరుగు శ్రీనివాస్‌గౌడ్, నారదాసు వసంతరావు, ఉమా శంకర్, సతినేని శ్రీనివాస్, గంటల రేణుక తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ

గంగాధర, మార్చి 25: గర్శకుర్తి గ్రామానికి చెందిన తడగమడ్ల వెంకటరెడ్డి, ఆచంపల్లి గ్రామానికి చెందిన ఆరె లచ్చయ్య మృతి చెందగా, బాధిత కుటుంబాలను మంగళవారం మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ పరామర్శించారు. అలాగే, గర్శకుర్తి గ్రామానికి చెందిన కొలకాని గణేశ్ అనారోగ్యంతో బాధపడుతుండగా మాజీ ఎమ్మెల్యే రవిశంకర్ పరామర్శించారు. ఇక్కడ నాయకులు ఆకుల మధుసూదన్, కంకణాల విజేందర్‌రెడ్డి, వేముల దామోదర్, రామిడి సురేందర్, పాశం కుమార్, తడిగొప్పుల రమేశ్, మామిడిపెల్లి అఖిల్, కొమురయ్య, మల్లయ్య, అజయ్ ఉన్నారు.

'ఆలయ ఫౌండేషన్' ఉదారత

జమ్మికుంట, మార్చి25: ప్రమాదవశాత్తు కాలు కోల్పోయిన కార్మికుడికి కృత్రిమ కాలు అందజేసి ఆలయ ఫౌండేషన్ ఉదారతను చాటుకున్నది. జమ్మికుంట పట్టణంలోని అంబేద్కర్ కాలనీకి చెందిన వడ్లూరి పోచయ్య అనే కార్మికుడు ప్రమాదవశాత్తు తన కుడి కాలును కోల్పోయాడు. కార్మికుడు కృత్రిమ కాలు కోసం ఆలయ ఫౌండేషన్ కో-ఆర్డినేటర్ గాదె గుణసాగర్‌ను సంప్రదించాడు. బాధితుడి విషయాన్ని కో-ఆర్డినేటర్ గుణసాగర్, ఆలయ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు పరికిపండ్ల నరహరి ఐఏఎస్‌కు తెలియజేశాడు. దీంతో నరహరి ఐఏఎస్ ప్రత్యేక చొరవ తీసుకుని శ్రీభగవాన్ మహావీర్ ట్రస్ట్ హైదరాబాద్ సౌజన్యంతో జైపూర్ నుంచి కృత్రిమ కాలును తెప్పించారు. సదరు కృత్రిమ కాలును బాధితుడు పోచయ్యకు మంగళవారం కో-ఆర్డినేటర్ గుణసాగర్ అందించారు. తనకు కృత్రిమ కాలును అందించిన ఆలయ ఫౌండేషన్ నిర్వాహకులకు పోచయ్య కృతజ్ఞతలు తెలిపాడు.

గుడుంబా తయారీదారుల బైండోవర్

శంకరపట్నం, మార్చి 25: గుడుంబా తయారీదారులు ఇద్దరిని ఎక్సైజ్ పోలీసులు బైండోవర్ చేశారు. ఎక్సైజ్ శాఖ ఎస్ఐ వినోద్ కుమార్ మంగళవారం కేశవపట్నం గ్రామానికి చెందిన కుమార్, శ్రీనివాస్‌ను అదుపులోకి తీసుకుని తహసీల్దార్ భాస్కర్ ఎదుట హాజరు పరిచారు.

విగ్రహాల ఆవిష్కరణకు సహకరించండి

తిమ్మాపూర్, మార్చి 25: మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో ఏర్పాటు చేసిన విగ్రహాలను ఆవిష్కరించేందుకు సహకరించాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య ఆధ్వర్యంలో విగ్రహాల ఆవిష్కరణ కమిటీ కన్వీనర్లు మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణను కలిసి విన్నవించారు. అలాగే కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్, ఆర్టీసీ ఎండీ సజ్జనార్‌కు లేఖ రాసినట్లు వెంకటయ్య తెలిపారు. ఇక్కడ కొంకటి లక్ష్మీనారాయణ, సుగుర్తి జగదీశ్వరాచారి, దుండ్ర రాజయ్య, మాతంగి శంకర్ వంతడుపుల సంపత్, మేడి అంజయ్య, ఎలుక ఆంజనేయులు, కనకం రాములు, సముద్రాల లక్ష్మణ్ ఉన్నారు.

శుభ శ్రీకి కలెక్టర్ అభినందన

కమాన్‌చౌరస్తా, మార్చి 25 : జిల్లా కేంద్రంలోని పారమిత హెరిటేజ్ పాఠశాలలో విద్యనభ్యసించిన బాల శాస్త్రవేత్త యువ ఆవిష్కర్త శుభశ్రీ సాహును మంగళవారం కలెక్టర్ పమేలా సత్పతి అభినందించారు. శుభశ్రీ రైతుల కోసం ఒక వినూత్న వ్యవసాయ యంత్రాన్ని రూపొందించి, దానిపై ఇప్పటికీ పనిచేస్తున్నారు. ఈ క్రమంలోనే జపాన్-ఆసియా యువ విజ్ఞాన మార్పిడి కార్యక్రమంలో పాల్గొనడానికి ఎంపికయ్యారు. జపాన్‌లో వారం రోజుల పాటు జరుగబోయే ఈ కార్యక్రమానికి పూర్తిగా విద్యార్థి ఖర్చులను భారత ప్రభుత్వమే భరిస్తుండగా, శుభ శ్రీని కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ప్రత్యేకంగా అభినందించారు.

ఫిర్యాదులు త్వరగా పరిష్కరించాలి

హుజూరాబాద్ టౌన్, మార్చి 25: ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలని కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం అన్నారు. హుజూరాబాద్‌లోని కేసీ క్యాంపులో గల హుజూరాబాద్ సబ్‌డివిజన్ ఏసీపీ కార్యాలయంలో డివిజన్ స్థాయి నేర సమీక్షా సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పిటిషన్ మేనేజ్మెంట్ సిస్టంను సరైన పద్ధతిలో అవలంబించాలన్నారు. సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు వారి పరిధిలోని పోలీస్ స్టేషన్లను తరచూ సందర్శిస్తూ సిబ్బంది పనితీరును పర్యవేక్షించాలన్నారు. డివిజన్‌ల వారిగా ఏసీపీ అధికారులు ప్రతినెలా నేర సమీక్షలు నిర్వహించాలన్నారు. సీసీసీ ద్వారా వచ్చే ఫిర్యాదులకు ప్రాధాన్యత కల్పించి త్వరగా పరిష్కరించాలని, తదితర అంశాలకు సంబంధించి పలు సూచనలు చేశారు. అనంతరం అధికారులకు కేటాయించిన వాహనాలను తనిఖీ చేశారు. సమావేశంలో హుజూరాబాద్ ఏసీపీ శ్రీనివాస్ జీ, ఇన్‌స్పెక్టర్లు రవి, కిశోర్, వెంకట్, సంతోష్ కుమార్, రమేశ్, సరిలాల్, ఎస్సైలు పాల్గొన్నారు.

కరెంట్ మోటర్ల వైర్లు చోరీ

గంగాధర, మార్చి 25 : మండలంలోని ర్యాలపల్లి వద్ద వరదకాలువలో చెర్లపల్లి(ఆర్) గ్రామానికి చెందిన రైతులు మోటర్లు వేసుకుని పంటలకు సాగు నీరు అందించుకుంటున్నారు. సోమవారం రాత్రి గుర్తు తెలియన దుండగులు తొమ్మిది మంది రైతుల మోటర్లకు చెందిన కాపర్ వైర్లను కట్ చేసి ఎత్తుకెళ్లారు. మంగళవారం ఉదయం పొలానికి నీళ్లు పెట్టడానికి వెళ్లిన రైతులు కాపర్ వైర్ చోరీకి గురైటన్లు గుర్తించారు. చోరీకి గురైన కాపర్ వైర్ విలువ దాదాపు రూ.50 వేల వరకు ఉంటుందని రైతులు తెలిపారు.

చింతపల్లి శ్రీనివాస్ రావుకు డాక్టరేట్

డాక్టరేట్ పట్టా అందుకుంటున్న శ్రీనివాస్ రావు

కమాన్‌చౌరస్తా, మార్చి 25 : జిల్లా కేంద్రానికి చెందిన సాధన స్కూల్ ఆఫ్ ఎక్స్‌లెన్ చైర్మన్ చింతపల్లి శ్రీనివాస్ రావు శ్రీ కృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ అందుకున్నారు. 'సమ్ ఫిక్స్‌డ్ పాయింట్ రిజల్ట్స్ ఇన్ ప్రాబబిలిస్టిక్ ఫజీ మెట్రిక్ స్పేస్' అనే థీసిస్‌పై శాతవాహన యూనివర్సిటీ మ్యాథమెటిక్స్ ప్రొఫెసర్ డాక్టర్ విజయ్ కుమార్ ఆధ్వర్యంలో ఆయన పరిశోధన పత్రం సమర్పించగా, డాక్టరేట్ పట్టాను సీబీఐటీ గణిత విభాగం ప్రొఫెసర్ డాక్టర్ ఎ పద్మ, శ్రీ కృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ జి. శోభలత, వైవా-వోస్ బోర్డు సిఫార్సుల ఆధారంగా ద్రావిడ విశ్వవిద్యాలయం కుప్పంలో అందజేశారు. ఈ క్రమంలో గణిత విద్యా సంఘం, కరస్పాండెంట్లు, పలువురు ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

పండ్ల తోటలతో ఆర్థికాభివృద్ధి

కరీంనగర్ రూరల్, మార్చి 25: పండ్ల తోటలు లాభదాయకమని, రైతులు వాటి పెంపకంపై దృష్టి సారించి ఆర్థికాభివృద్ధి సాధించాలని జిల్లా వ్యవసాయ అధికారి జె. భాగ్యలక్ష్మి సూచించారు. మండలంలోని చామనపల్లి గ్రామంలోని రైతు వేదికలో నిర్వహించిన రైతు నేస్తం కార్యక్రమానికి ఆమె హాజరై మాట్లాడారు. వేసవిలో పశుగ్రాసం కొరత రాకుండా రైతులు పశుగ్రాస యాజమాన్య పద్ధతులు పాటించాలని సూచించారు. అలాగే వివిధ గ్రామాల్లో ఎరువుల షాపులను తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఏడీఏ రణధీర్, ఏవో బీ సత్యం, ఏఈవోలు, రైతులు పాల్గొన్నారు.

ఆరోగ్య కేంద్రాల పరిశీలన

విద్యానగర్, మార్చి 25: నగరంలోని బుట్టి రాజారాం కాలనీలో గల పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని, తీగల గుట్టపల్లిలో గల బస్తీ దవాఖానలో మంగళవారం నిర్వహిస్తున్న ఆరోగ్య మహిళా శిబిరాన్ని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆరోగ్య మహిళా కేంద్రంలో చేస్తున్న పరీక్షల వివరాలను అడిగి తెలుసుకున్నారు. రికార్డులను తనిఖీ చేశారు. ఫార్మసీలో మందుల నిల్వలను పరిశీలించారు. శిబిరంలో వైద్యులు లావణ్య, డీపీవో స్వామి సిబ్బంది పాల్గొన్నారు.

'జిల్లాకు మంత్రి పొన్నం ద్రోహం'

కమాన్‌చౌరస్తా, మార్చి 25: రాష్ట్రానికి తలమాణికంగా ఉన్న కరీంనగర్ జిల్లాకు ప్రభుత్వ ఇంజినీరింగ్ కళాశాల మంజూరు చేయాలని భారత విద్యార్థి ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు కాంపెల్లి అరవింద్, శాతవాహన యూనివర్సిటీ అధ్యక్షుడు చిట్యాల రాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం యూనివర్సిటీలో వారు విలేకరులతో మాట్లాడుతూ, ప్రభుత్వం హుస్నాబాద్ నియోజకవర్గానికి ఇంజినీరింగ్ కళాశాల కేటాయించి ఇక్కడి విద్యార్థులకు తీవ్ర అన్యాయం చేసిందన్నారు. కరీంనగర్ జిల్లాలో ప్రభుత్వ ఇంజినీరింగ్ కళాశాల కలగానే మిగిలిపోయిందని, మంత్రి పొన్నం ప్రభాకర్ కరీంనగర్ జిల్లాకు పూర్తిగా ద్రోహం చేశారని ఆరోపించారు. ప్రభుత్వ ఇంజినీరింగ్ కళాశాల కరీంనగర్‌లోనే ఏర్పాటు చేయాలని, లేకుంటే పోరాటాలకు సిద్ధమవుతామని తేల్చిచెప్పారు. ఇక్కడ ఎస్ఎఫ్ఐ నాయకులు ఉన్నారు.

ప్రభుత్వం పునరాలోచన చేయాలి

కమాన్‌చౌరస్తా, మార్చి 25 : హుస్నాబాద్‌లో ఇంజినీరింగ్ కళాశాల ఏర్పాటుకు సంబంధించి తీసుకున్న నిర్ణయంపై ప్రభుత్వం పునరాలోచన చేయాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠ రెడ్డి ఒక ప్రకటనలో కోరారు. కరీంనగర్‌లో ప్రభుత్వ ఇంజినీరింగ్ కళాశాల ఏర్పాటు చేస్తే ఉత్తర తెలంగాణకు ఎడ్యుకేషన్ హబ్ కేంద్రంగా కరీంనగర్ మారుతుందని తెలిపారు.

శాతవాహన పరిధిలో లా, ఇంజినీరింగ్ కళాశాలలు మంజూరు

కమాన్‌చౌరస్తా, మార్చి 25 : శాతవాహన యూనివర్సిటీ పరిధిలో లా కళాశాల, ఇంజినీరింగ్ కళాశాల మంజూరు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం సోమవారం రాత్రి జీవోలు విడుదల చేసింది. ఇందులో భాగంగా కరీంనగర్ ఉమ్మడి జిల్లాకు చెందిన మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రాతినిధ్యం వహిస్తున్న హుస్నాబాద్‌లో ఇంజినీరింగ్ కాలేజీ, కరీంనగర్ జిల్లా కేంద్రంలోని శాతవాహన యూనివర్సిటీ క్యాంపస్‌లో లా కళాశాల ఏర్పాటుకు పచ్చ జెండా ఊపింది. ఈ రెండు కాలేజీలు వచ్చే విద్యా సంవత్సరం (2025-26) నుంచి ప్రారంభం కానున్నాయి. హుస్నాబాద్‌లో యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్‌లో బీటెక్ సీఎస్ఈ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఐటీ, ఈసీఈ బ్రాంచ్‌లు ప్రారంభించబోతున్నారు. ఇంజినీరింగ్ కాలేజీ నిర్మాణానికి రూ.44.12 కోట్లు కేటాయించగా, అందులో రూ.29.12 కోట్లు ప్రస్తుతం మంజూరు చేశారు. మిగతా రూ.15 కోట్లను తర్వాత మంజూరు చేయనుంది. శాతావాహన వర్సిటీలో ఏర్పాటు చేయనున్న లా కాలేజీలో మూడేళ్ల కోర్సు, రెండేళ్ల కోర్సు(మేధో సంపత్తి చట్టం)లో అడ్మిషన్లు ఇవ్వబోతున్నారు. ఈ కాలేజీ నిర్మాణానికి మొత్తం రూ.22.96 కోట్లు కేటాయించగా.. అందులో ప్రస్తుతం రూ.5 కోట్లు మంజూరు చేశారు. మొత్తంగా రూ.67.08 కోట్లను ప్రభుత్వం ఈ రెండు కాలేజీలకు కేటాయించనుంది. రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయంపై శాతవాహన వీసీ ఉమేశ్ కుమార్ సంతోషం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన ఉదయం హైదరాబాద్‌లో రాష్ట్ర ఉప ముఖ్యమంత్